క్లుప్తంగా

లోయర్ మానేరు డ్యామ్ రెండు గేట్లు మూసివేత

తిమ్మాపూర్: ఎల్‌ఎండీ రెండు గేట్లను అధికారులు మూసివేశారు. గురువారం రాత్రి కురిసిన వర్షానికి రిజర్వాయర్‌లోకి భారీగా వరదనీరు చేరింది. అర్ధరాత్రి పది గేట్ల ద్వారా 30 వేల క్యూసెక్కుల నీరు దిగువకు వదిలారు. శుక్రవారం తెల్లవారుజామున కొంచెం లెవెల్ పెంచి 36 వేల క్యూసెక్కుల నీరు మధ్యాహ్నం వరకు వదలగా.. మోయతుమ్మెద వాగుకు వరద తగ్గడంతో సాయంత్రం రెండు గేట్లు మూసివేశారు. పైనుంచి ఇన్‌ఫ్లో తగ్గుతుండగా శనివారం మరిన్ని గేట్లు మూసే అవకాశం ఉందని ఎస్సారెస్పీ అధికారులు తెలిపారు.

కేశవపట్నం పీహెచ్‌సీని సందర్శించిన డీటీసీవో



మాట్లాడుతున్న డీటీసీవో రవీందర్‌రెడ్డి

శంకరపట్నం: కేశవపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం డీటీసీవో రవీందర్‌రెడ్డి సందర్శించారు. గ్రానైట్ క్వారీ, రైస్‌మిల్, సీడ్ ప్లాంట్, ఎస్‌హెచ్‌ఏ(563) పనులు చేసే కార్మికులు శ్వాసకోశ సమస్యలతో బాధపడతారని వారికి వైద్య పరీక్షలు నిర్వహించాలని వైద్యాధికారి శ్రావణ్‌కుమార్‌కు సూచించారు. మండలంలో 15 మంది శ్వాసకోశ సమస్యలతో బాధపడుతుండగా కొందరి ఇళ్లను పరిశీలించారు.

మృతుల కుటుంబాలకు అండగా సీపీఐ

చిగురుమామిడి: మృతుల కుటుంబాలకు సీపీఐ అండగా ఉంటుందని పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని రేకొండలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన జేడి వసంత, బోయిని లలిత కుటుంబాలను శుక్రవారం పరామర్శించారు. భారీ వర్షాలతో ఇబ్బందులు పడుతున్న కుటుంబాలను పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. వెంట సీపీఐ గ్రామశాఖ కార్యదర్శి బోయిని వల్లభాయిపటేల్, నాయకులు రవీందర్, పర్శయ్య, కొత్తూరి వెంకట్రాజం, ఏరుకొండ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ చందు

జమ్మికుంట: పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, మండలంలోని కోరపల్లిలో వావిలాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డా. చందు, ఎంపీడీవో విజయ్ కుమార్ హాజరై మాట్లాడారు. సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిసర, వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. 97 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. 8 మంది జ్వరపీడితుల రక్త నమూనాలను సేకరించి పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపించారు. కార్యక్రమంలో వైద్యులు బిందు, మహోన్నతపటేల్, ఎల్త్ ఎడ్యుకేటర్స్ ప్రతాప్‌గౌడ్, మోహన్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ నరేందర్, ఏఎన్‌ఎంలు మంజుల, రజిత ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చెర్లభూత్కూర్‌లో ...



మందులు పంపిణీ చేస్తున్న లింగారెడ్డి

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్‌లో ప్రాంతీయ పశుసంవర్ధక శిక్షణా కేంద్రంలో నిర్వహిస్తున్న పశు వైద్య అధికారుల ప్రత్యేక శిక్షణా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ ఎన్.లింగారెడ్డి పాడి పశువుల ఉచిత గర్భకోశ వ్యాధుల నివారణ శిబిరాన్ని ప్రారంభించారు. పాడి రైతుల లాభ నష్టాలను పునరుత్పత్తి సమస్యలు ప్రభావితం చేస్తాయని తెలిపారు. పాడి పశువుల పునరుత్పత్తి సమస్యలపై పశువైద్యులు అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం 24ఆవులు, గేదేలకు గర్భకోశ పరీక్షలు, 68 పశువులకు సాధారణ వ్యాధుల పరీక్షలు నిర్వహించి సంబంధిత రైతులకు మందులు పంపిణీ చేశారు. అనంతరం గోపాలమిత్ర భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు వినోద్‌కుమార్, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ముఖ్యఅధికారి సత్యప్రసాద్‌రెడ్డి, శిక్షణా కేంద్రం వైద్యులు ఎం.కోటేశ్వర్‌రావు, సాయిచైతన్య, దివ్య,బొమ్మకల్, కొత్తపల్లి పశువైద్యాధికారులు జ్యోత్స్న, రామకృష్ణ, సింగిల్‌విండో చైర్మన్ పి.శ్యాంసుందర్‌రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు రమణారెడ్డి, బి. తిరుపతిగౌడ్, డెయిరీ అధ్యక్షుడు పి.శంకర్, కొమురయ్య, ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- కాలువ నిండి బయట ప్రవహిస్తున్న వరదనీరు
- గండిపడే అవకాశముందంటున్న రైతులు

చిగురుమామిడి: మండలంలోని మిడ్ మానేరు కుడి కాల్వకు వరదనీటితో ప్రమాదం పొంచి ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు కెనాల్ నిండుగా వరదనీరు పారుతోంది. చిన్నముల్కనూర్–పీచుపల్లి గ్రామాల మధ్య కెనాల్ నిండి బయటకు నీరు ప్రవహిస్తోంది. దీంతో ఎప్పుడు గండిపడుతుందోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పీచుపల్లిలో రెండు కుంటలు నిండి వరద బయటకు వెళ్లే మార్గం లేక నేరుగా కెనాల్‌లోకి రావడంతో ప్రమాదకరంగా మారింది. అలాగే రేకొండ, బొమ్మనపల్లి గ్రామాల్లో ఇదే పరిస్థితి. ఈ గ్రామాల్లో ప్రస్తుతం చెరువు, కుంటలు పూర్తిస్థాయిలో నిండలేదు. ఒకవేళ నిండితే వాటి వరద తాకిడి నేరుగా కుంటల్లోకి ప్రవహించే ప్రమాదం ఉందని రైతులు ఆరోపిస్తున్నారు. తోటపల్లి సాగునీటి రిజర్వాయర్ నుంచి ఓగులాపూర్, ఇందుర్తి, ముదిమాణిక్యం, రామంచ, సీతారాంపూర్, పీచుపల్లి, రేకొండ, బొమ్మనపల్లి గ్రామాల నుంచి సైదాపూర్ మండలంలోని కొన్ని గ్రామాల వరకు 30 స్ట్రక్చర్ల నిర్మాణానికి ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదనలు పంపినప్పటికీ నిధులు మంజూరు కాలేదు. దీంతో ఏటా వర్షాకాలంలో కెనాల్‌కు గండ్లు పడి వరిపొలాల్లో ఇసుకమేటలు వేస్తుందని ఆయా గ్రామాల రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా వరదనీరు కెనాల్‌లోకి రాకుండా సూపర్‌పాస్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని రైతులు కోరుతున్నారు.



పీచుపల్లి గ్రామ సమీపంలో కెనాల్ నుంచి బయటకు ప్రవహిస్తున్న వరదనీరు

పల్లె దవాఖానా ప్రారంభం

తిమ్మాపూర్: పల్లె ప్రజలకు ఉచిత వైద్యం అందుబాటులో ఉండాలనదే ప్రభుత్వ లక్ష్యమని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండలంలోని పర్లపల్లి గ్రామంలో నిర్మించిన పల్లె దవాఖానను ప్రారంభించారు. ఆరోగ్య ఉపకేంద్రాల్లో పూర్తిస్థాయిలో మందులు, వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయని, ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించకుండా సర్కారు దవాఖానాల్లో వైద్య సేవలు పొందాలన్నారు. పొలంపల్లి గ్రామంలో కల్వర్టు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు బండారి రమేశ్, మాజీ అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధగోని లక్ష్మీనారాయణగౌడ్, నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాసరావు, కుంట రాజేందర్ రెడ్డి, శ్రీగిరి రంగారావు, బుధారపు శ్రీనివాస్, గంకిడి లక్ష్మారెడ్డి, చింతల లక్ష్మారెడ్డి, అనభేరి రాధాకిషన్ రావు, పోలు రాము, రమేశ్, కొత్త తిరుపతిరెడ్డి, రాజిరెడ్డి, కొండల్ రావు, కొండయ్యగౌడ్, గోగూరి నర్సింహారెడ్డి, రెడ్డిగాని రాజు, రాములుయాదవ్, బండారుపెల్లి లక్ష్మణ్, ముప్పిడి సంపత్ రెడ్డి, కె.సంపత్, వినోద్ కుమార్, లింగయ్య, యాదగిరి, ముత్యాల సంపత్, ఆశిక్ పాషా తదితరులు పాల్గొన్నారు.



దవాఖాన ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

మొరాయించిన రైల్వే గేటు



కరీంనగర్–జగిత్యాల మెయిన్ రోడ్డులోని గంగాధర మండలం మంగపేట సమీపంలోని రైల్వే గేట్ శుక్రవారం ఉదయం మొరాయించింది. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఉదయం రైలు వచ్చే టైంలో గేటు వేశారు. ఆ తర్వాత గేటు తీయడానికి ప్రయత్నిస్తే మొరాయించింది. దీంతో వాహనాలు పెద్దసంఖ్యలో నిలిచిపోయాయి. అనంతరం సిబ్బంది మరమ్మతు చేయడంతో సమస్య తీరింది. ఇది ఇలాఉంటే గేట్ తరచూ మొరాయిస్తున్నట్లు వాహనదారులు పేర్కొంటున్నారు.

– గంగాధర

వ్యాసరచన పోటీలో విద్యార్థుల ప్రతిభ



ప్రశంసపత్రాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టాటా బిల్డింగ్ ఇండియా ఆధ్వర్యంలో విద్యార్థులకు ×స్వీయ ఆధారిత భారతదేశాన్ని నిర్మించడానికి నేను చేసే ఐదు పనులు¥ అనే అంశంపై శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జూనియర్ విభాగంలో ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు ప్రథమస్థానం టి.సూర్యతేజ, ద్వితీయస్థానం పి.భరత్ చంద్ర, తృతీయస్థానంలో ఇ.సాత్విక నిలిచారు. సీనియర్ విభాగంలో ఎం.రచన ప్రథమ స్థానం, ఎం.సహస్ర ద్వితీయ స్థానం, ఇ.అభిరామ్ తృతీయస్థానం సాధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నస్మీన్, ఉపాధ్యాయులు సీహెచ్.వేణు, కే.సత్యం,ఎం. సమ్మిరెడ్డి, జి.అన్నపూర్ణ,డి. ఉమాదేవి విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర అథ్లెటిక్స్ పోటీలకు అల్ఫోర్స్ విద్యార్థులు

కొత్తపల్లి: కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో ఇటీవల జరిగిన ఎస్జీఎఫ్ అర్బన్‌స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీటాట్స్ పాఠశాల విద్యార్థులు ప్రతిభకనబర్చి రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ పోటీలకు ఎంపికైనట్లు ఆ విద్యా సంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి తెలిపారు. అండర్–14 విభాగం 600–400 మీటర్ల పరుగు పందెంలో శ్రేయస్స్ వర్మ బంగారు పతకం, అండర్–14 బాలికల విభాగం షాట్‌పుట్‌లో పి.ఆరాధ్య రజత పతకం, అండర్–17 ట్రిపుల్ జంప్ విభాగంలో వైష్విక రజత పతకం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించిందని అన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో సైతం సత్తాచాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు

కరీంనగర్‌లోని అంబేడ్కర్ ఇండోర్ స్టేడియంలో జిల్లా యోగా అసోసియేషన్ నిర్వహించిన జిల్లా స్థాయి అండర్12 బాలికల విభాగంలో కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈటెక్నో స్కూల్ విద్యార్థిని ఈశాన్య ప్రతిభ కనబరచి మూడో స్థానం కైవసం చేసుకుని హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు ఆ విద్యా సంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి అన్నారు. రాష్ట్రస్థాయిలో సైతం సత్తా చాటి జాతీయస్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షిస్తూ పుష్పగుచ్ఛంతో అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

15,16 తేదీల్లో డిగ్రీ స్పాట్ అడ్మిషన్లు

జమ్మికుంట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 15,16 తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నామని ప్రిన్సిపాల్ రమేశ్ శుక్రవారం తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో మిగులు సీట్లను భర్తీ చేయనున్నామని, ఆసక్తి గల విద్యార్థులు హాజరుకావాలన్నారు. అనుభవం గల అధ్యాపకులు, డిజిటల్ లైబ్రరీ, ఆధునిక కంప్యూటర్ ల్యాబ్, జిమ్, ఎన్‌ఎస్‌ఎస్, విశాలమైన క్రీడా మైదానం వంటి మెరుగైన వసతులున్నాయని, దాతల సహకారంతో విద్యార్థులకు ఉచిత మధ్యాహ్న భోజన వసతి నిర్వహిస్తున్నామని విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నియామకం

జమ్మికుంట: పట్టణానికి చెందిన ఆకుల రాజయ్యపటేల్‌ను మున్నూరుకాపు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు పుట్టం పురషోత్తమరావుపటేల్ శుక్రవారం ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పర్వతం సతీశ్, కోశాధికారి కంచి సత్యనారాయణ, సీనియర్ నాయకులు రాజేందర్, కొలకాని రాజు, పోచయ్య, తిరుపతి, పొన్నగంటి రవి పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

ఇల్లందకుంట: ఎన్పీడీసీఎల్ హుజూరాబాద్ డివిజన్ (327) యూనియన్ అధ్యక్షుడిగా ఇల్లందకుంట గ్రామానికి చెందిన విజ్జిగిరి అంజయ్యను శుక్రవారం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డివిజన్ కార్యదర్శిగా శ్రీపతిసుధాకర్, సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వట్టిమల్ల నవీన్, ట్రేజరర్‌గా మచ్చగిరిసుదర్శన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పంజాల శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్‌గా కాటిపెల్లి విజయ, స్వరూప, సెక్రటరీగా శ్రీనివాస్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఉమ్మడి రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు శ్రీపతి తులసి, సర్కిల్ అధ్యక్ష, కార్యదర్శులు యుగంధర్, కనుకుంట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రణవ్, అసోసియేషన్ బాధ్యులు

హుజూరాబాద్: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆవరణలో హుజూరాబాద్ మండల ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలోని ఫొటో ఎక్స్‌పో పోస్టర్‌ను శుక్రవారం కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితెల ప్రణవ్ ఆవిష్కరించారు.19, 20, 21వ తేదీల్లో హైదరాబాద్‌లో ఫొటో ఎక్స్‌పో జరగనుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తలకొక్కుల హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి దూలం చిరంజీవి, కోశాధికారి మధుకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాచర్ల రాజుగౌడ్, ఉపాధ్యక్షుడు ఎండీ యాకుబ్ అలీ, ఎడ్ల కుమారస్వామి కొయ్యాడ శ్రీశైలం, వెంకటయ్య, వేముల శ్రీనివాస్, రమేశ్, మురళి, రాజేశ్, భిక్షపతి, సృజన్, శ్రీధర్ తదితరులున్నారు.

విద్యార్థి దశలోనే సేవాగుణం అలవర్చుకోవాలి

కొత్తపల్లి: విద్యార్థి దశలోనే సేవాగుణాన్ని అలవర్చుకోవాలని లయన్ సింహరాజు కోదండరాం అన్నారు. కరీంనగర్ సూర్యనగర్‌లోని అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో శుక్రవారం ఏర్పాటు చేసిన లియో క్లబ్ ఆఫ్ ఆల్ఫోర్స్ ఉమెన్స్ డిగ్రీ కాలేజీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. లియో క్లబ్ సమాజహిత కార్యక్రమాలు చేసి పౌరసమాజ ప్రశంసలు, అవార్డులు పొందడం హర్షనీయమన్నారు. లియో క్లబ్ ప్రెసిడెంట్‌గా కె.సహశ్రీ, సెక్రటరీ కె.తపస్విభు, కోశాధికారి ఎస్.శ్రీవిద్యలతో కూడిన 20 మంది లియో సభ్యుల ఇన్‌స్టాలేషన్‌లో భాగంగా ప్రమాణస్వీకారాన్ని ఫస్ట్ వైస్ గవర్నర్ లయన్ మోరె భద్రేశమ్ నిర్వహించి సభ్యుల బాధ్యతలు వివరించారు. కళాశాల చైర్మన్ వి.రవీందర్ రెడ్డి, లయన్స్‌క్లబ్ బాధ్యులు డా.మధుసూదన్ రెడ్డి, ఇనుగుర్తి రమేశ్, వి.జగదీశ్వర చారి, తిరుపతిరెడ్డి, జి.చంద్రశేఖర్, పి.సురేందర్, ఎం.మహేందర్ పాల్గొన్నారు.



కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో అతిథులు

బీఆర్‌ఎస్ పాలనలోనే ఎల్లంపల్లి ప్రాజెక్టుకు పూర్తి సార్థకత

కరీంనగర్: ఎల్లంపల్లి ప్రాజెక్టు విషయంలో కొన్ని వర్గాలు వాస్తవాలను వక్రీకరిస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. శుక్రవారం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రాజెక్టుల మీద అవగాహన లేకుండా ఆరోపణలు చేసే మేధావులు ముందుగా చరిత్ర తెలుసుకోవాలన్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు శంకుస్థాపన దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో జరిగిందని, దాన్ని మేము ఎప్పుడూ తిరస్కరించలేదని కానీ ఆ ప్రాజెక్టుకు పూర్తి సార్థకత తీసుకువచ్చింది మాత్రం బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని, కాళేశ్వరం ఎత్తిపోతలతో ఎల్లంపల్లి ప్రాజెక్టుకు జీవం పోశారు తెలంగాణ బాపు కేసీఆర్ అని కొనియాడారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న సుంకె రవిశంకర్

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

మానకొండూర్: మండల కేంద్రంలోని టపాసుల దుకాణం వద్ద మానకొండూర్ ఫైర్ సిబ్బంది శుక్రవారం అగ్ని ప్రమాదాల నివారణపై షాపు యజమానులు, అందులో పనిచేసే సిబ్బందికి అవగాహన కల్పించారు. ఫైర్ సేఫ్టీ సామగ్రిపై అవగాహన ఉంటే అగ్నిప్రమాదాల సమయంలో ఏవిధంగా వినియోగించాలో తెలుస్తుందని, త్వరగా ప్రమాదాలను నివారిస్తే నష్టం తక్కువగా వాటిల్లుతుందని వివరించారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది ఎల్‌ఎఫ్ సంతోశ్‌కుమార్, వినోద్‌కుమార్, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

పోచంపల్లిలో శుక్రవారం సభ



కేక్ తినిపిస్తున్న అంగన్‌వాడీసూపర్ వైజర్ రమ

మానకొండూర్: పోచంపల్లి గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సభ నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రమ తల్లులు, గర్భిణులతో మాట్లాడారు. చిన్నారుల బర్త్ డే సందర్భంగా కేక్‌కట్ చేశారు. అంగన్‌వాడీ సేవలు, పోషకాహారం, శుభ్రత తదితర అంశాల గూర్చి తెలియజేశారు.

రేపు జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు

కరీంనగర్‌స్పోర్ట్స్: నగరంలోని అంబేడ్కర్ స్టేడియంలో ఈనెల 14న సబ్ జూనియర్ బాలబాలికల కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చెన్నాడి అమిత్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంపత్‌రావు, ప్రధాన కార్యదర్శి మల్లేశ్‌గౌడ్ తెలిపారు. క్రీడాకారులు 16ఏళ్ల లోపు 55కిలోల లోపు బరువు ఉండాలని అన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 25నుంచి నిజామాబాద్ జిల్లాలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

గుంతల పూడ్చివేత

రామడుగు: వెలిచాల నుంచి కొత్తపల్లికి వెళ్లే రోడ్డుపై ఏర్పడిన భారీ గుంతలతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. రామడుగు సింగిల్ విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వర్‌రావు అభిమానులు వినోద్, ప్రశాంత్, గొల్లపల్లి మహిపాల్ సిమెంట్, కంకరతో గుంతలు పూడ్చివేశారు.



శంకరపట్నం: మొలంగూర్ గ్రామంలోని సాగునీటి కాలువలో తుమ్మచెట్లు, పిచ్చిమొక్కలను సంబంధిత అధికారులు తొలగించడంలేదని రైతులు ఆరోపిస్తున్నారు. మొలంగూర్ గ్రామానికి సాగునీరందించే డీబీఎం –13 ఉపకాలువ, 6ఎల్ కాలువలకు సాగునీరు కొద్దిగా మాత్రమే వస్తుందని, అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
కవిత, ఎస్సారెస్పీ డీఈ, సెల్ నంబర్: 9177812458

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

హుజూరాబాద్: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. బతుకమ్మ పండుగకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా పనులను పర్యవేక్షించాలని, అన్ని వసతులు కల్పించాలన్నారు.పేదకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని, కోతుల బెడదకు వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. వర్షాలతో జరిగిన నష్టాన్ని అంచనా వేయాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలను అధికారులు నిత్యం పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, అధికారులు పాల్గొన్నారు.



లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

జూట్ బ్యాగులు పంపిణీ



జమ్మికుంట: మహిళలు ప్లాస్టిక్ నిర్మూలనకు తోడ్పాడాలని మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్ అన్నారు. శుక్రవారం పట్టణంలో జీవన జ్యోతి పట్టణ సమైక్య సంఘాల సమావేశం నిర్వహించారు. మహిళలు రూ.యాభై లక్షల వరకు తీసుకునే లోన్‌ను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా ఎదగాలన్నారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులకు జూట్ బ్యాగ్ అందించామని, నిత్యావసర సరుకుల కొనుగోలుకు వాడుకోవాలని సూచించారు. ఈఈ శ్రీకాంత్, జీవన జ్యోతి పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు రాణి, కార్యదర్శి మౌనిక, కోశాధికారి గీత, సమైఖ్య అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్ స్తంభాల ఏర్పాటు



చొప్పదండి: పట్టణంలోసెంట్రల్ లైటింగ్ పనుల్లో భాగంగా శుక్రవారం డివైడర్‌ల మధ్య స్తంభాలు ఏర్పాటు చేస్తున్నారు. డివైడర్ నిర్మించి రెండేళ్లు కాగా ప్రస్తుతం విద్యుత్ స్తంభాలు, తారురోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. దసరా, దీపావళి పండుగలు సమీపిస్తుండటంతో సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రైతులను ఆదుకోవాలి

మానకొండూర్: ప్రభుత్వం రైతులకు సరిపడా యూరియాను అందించడంలో పూర్తిగా విఫలమైందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాయికంటి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో యూరియా అందిస్తున్న సెంటర్ వద్ద రైతులతో కలిసి మాట్లాడారు.రైతులకు సరిపడా యూరియా సమకూర్చాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున రైతులతో ఆందోళన నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

హైకోర్టు జడ్జికి జమ్మికుంట న్యాయవాదుల వినతి



వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాదులు

జమ్మికుంట: జమ్మికుంటలో ప్రథమశ్రేణి జ్యూడిషయల్ మేజిస్ట్రేట్, జూనియర్ సివిల్ జడ్జి, సెకండ్ అడిషనల్ కోర్టులు ఏర్పాటు చేయాలని హైకోర్టు న్యాయమూర్తి, కరీంనగర్ జిల్లా పోర్టు పోలియో ఇన్‌చార్జి జడ్జి ఎస్.తుకారాంజీకి జమ్మికుంట న్యాయవాదులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. జమ్మికుంట, ఇల్లందకుంట, వీణవంక మండలాలలో సుమారు ఐదువేలకు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, హుజూరాబాద్ కోర్టుకు వెళ్లడానికి ప్రాంతవాసులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు పవన్‌కుమార్, ఏబూషి లింగారెడ్డి, పొట్లపల్లి శ్రీధర్‌బాబు, నక్క సత్యనారాయణ, మొలుగూరి సదయ్య, హుజూరాబాద్ బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ నూతల శ్రీనివాస్, రావికంటి మధుబాబు, గుండ వరప్రసాద్, అబ్బరవేని రాజ్‌కుమార్, హైకోర్టు న్యాయవాదులు పొన్నం అశోక్‌గౌడ్, దయానంద రావు, పాండు పాల్గొన్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో నాయకుల పర్యటన

హుజూరాబాద్: పట్టణంలోని గాంధీనగర్, బుడగ జంగం కాలనీ, మామిండ్లవాడ, కిందివాడ గురువారం రాత్రి కురిసిన వర్షానికి నీట మునిగిపోవడంతో శుక్రవారం బీజేపీ నాయకులు పర్యటించారు. లోతట్టు ప్రాంతాల్లో వరదనీరు చేరి కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్న ప్రభుత్వ, అధికార యంత్రాంగం చర్యలు చేపట్టకపోవడం ఏంటని ప్రశ్నించారు. వరద నీటి పరిష్కారానికి శాశ్వత చర్యలు చేపట్టాలన్నారు. వెంటనాయకులు తూర్పాటి రాజు, తూర్పాటి రామచంద్రం, రాజశంకర్, అనిల్, సాయి తదితరులు ఉన్నారు. కాలనీల్లోకి వరదనీరు చేరడంతో కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితెల ప్రణవ్, నాయకులతో కలిసి పర్యటించారు. ప్రజల ఇబ్బందులను తెలుసుకున్నారు. వరదసమస్యకు శాశ్వత పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఫోన్‌లో కలెక్టర్‌తో మాట్లాడారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను కోరారు.